# సూర్యనమస్కారం

రసరాజు

"లతా..."

ఆమె ఉలిక్కిపడి చూసింది.

బస్సు నిండా జనం.

ఎవ రెక్క డున్నారో తెలీడం లేదు.

"నేను, లతా..."

ఈ సారి ఆమె కళ్ళు నిశితంగా వెదికాయి.

ఆమె కూర్చున్న సీట్ ప్రక్కన నిలబడి అతనూ ప్రయాణం చేస్తున్నాడు. పొట్టిగా, నల్లగా ఉన్నాడు. అయ్యప్ప దీక్షలో ఉన్నాడో ఏమో-బట్టలు కూడా అవే రంగులో ఉన్నాయి. గడ్డం బాగా మాసిపోయి ఉంది. ఎత్తయిన పళ్ళు. అనాకారితనానికి అతనే ప్రబల సాక్ష్యంగా కనిపిస్తున్నాడు.

"మీరు..." సందిగ్ధావస్థలో అడిగిం దామె.

"అరే-సూర్యప్రకాష్‌ని-నన్నే గుర్తుపట్టలేదా..."

"..."

"ఎక్కడ ఉంటుంట? రాజమండ్రిలోనేనా?..."

ఆమె నీళ్ళు నముల్తోంది.

"ఇంకా గుర్తురాలేదా? రాజమండ్రిలో అభ్యుదయ కళాసమితికి సెక్రటరీగా ఉండేవాణ్ణి."

ఆమె ముఖంలో ఆశ్చర్యం, అయోమయం.

ప్రక్కనే లీల కూర్చుంది.

లీల లతకు స్నేహితురాలు.

వెర్రితలలు వేస్తున్న అధునాతన నాగరికతా వ్యామోహానికి ఆమె అచ్చమయిన ప్రతినిధి అని చెప్పుకొంటే తప్పులేదు.

ఆమె కట్టూ, బొట్టూ అనునిత్యం అలవోకగా మారిపోతుంటాయి.

లత లీలవేపు చూసింది.

లీల 'ఇదెక్కడి గోలన్నట్లుగా ముఖం చిట్లించింది.

ఈ పరిణామానికి అతను నిలువునా నీరయిపోయాడు, పాపం!

తనెవరో నిరూపించుకోవడానికి బలంగా అతడు మరే ప్రయత్నమూ చేయలేదు.

బస్సులో ప్రయాణీకులంతా అతణ్ణి అదోలా చూడటం మొదలుపెట్టారు.

బస్సు ముందుకు సాగిపోతోంది. లత మనస్సు మాత్రం ఎక్కడో గతంలోకి వెళ్ళిపోయింది.

తన కప్పుడు పద్దెనిమిదేళ్ళ వయసు. అప్పటికే నాటకాల్లో వేషాలేస్తోంది. వచ్చిన డబ్బుల్తో తల్లీ, తనూ కడుపు నింపుకోడమే ఓ పెద్ద సమస్యలా ఉన్న రోజు లవి. లక్ష్మి కూడా తనలాగే వేషాలేస్తున్నా, ఆమె దారి వేరుగా ఉండేది. దారి తప్పి సంపాదించడం ఆమె కలవాటు అయిందేమో-ఆమె బ్రతుకులో ఈ బాధలేవీ కనిపించేవి కావు. తనకుమాత్రం అదో పాపకూపంలా కనిపించేది.

ఏ నీలినీడలూ తన బ్రతుకులో ప్రాకకుండా ఉండాలనేదే తన అభిప్రాయం.

ఓ రోజు...

పరిషత్ పోటీల సందర్భంగా ఉన్న ఊళ్ళోనే వేషం వేయాల్సి వచ్చింది.

ఆ నాటకం ప్రదర్శనానంతరం మంచి పేరు తెచ్చుకుంది. అందులో తన వేషానికి ఎప్పుడూ లేనంత గుర్తింపు లభించింది. ఆ తర్వాత ఉత్తమ నటి కిచ్చే బహుమతికూడా తననే వరించింది. ఆ రోజు గ్రీన్ రూమ్‌లో రంగు చెరిపేసుకుంటూ ఉండగా ఎవరో ఒక వ్యక్తి వచ్చి 'వేషం సువర్బ్' అంటూ అదేపనిగా అభినందనలు చెప్పి, తన చిరునామాను సవివరంగా అడిగి తెలుసుకొన్నాడు.

అతనెవరో తనకు ఇదమిత్థంగా తెలీదుగాని, ముఖం మాత్రం ఎక్కడో చూసినట్లే ఉంది. పేరు సూర్యప్రకాష్ అని. ఎకౌంటెంట్‌గా అదే ఊళ్ళో పనిచేస్తున్నాననీ అతను పరిచయం చేసుకున్నాడు. అప్పట్నుంచి అతని కేమనిపించిందో ఏమో-రెండు మూ డు సార్లయినా తన ఇంటి కొచ్చాడు. తన ఆర్థిక పరిస్థితిని వివరంగా అడిగి తెలుసుకొన్నాడు.

ఎందు కలా అడిగాడో అప్పుడయితే తనకు బోధపళ్ళేదు కాని, ఆ తర్వాత రెణ్ణెల్లకి అతను తలపెట్టిన మహత్కార్యం తనలో ఆనందాశ్చర్యాల్ని రేకెత్తించింది. అంత మంచి కార్యకర్త మరొక డుండడేమో అనిపించింది. అభ్యుదయ కళాసమితికి అతడు సెక్రటరీ అయ్యాడు. "కళాకారుల సహాయార్థం" ఒక కార్యక్రమాన్ని అతను తలపెట్టి ఆరువేల రూపాయలవరకు సంపాదించగలిగాడు. ఒక సభలో ఆ ఆరువేల రూపాయలూ వివిధ రంగాల్లో ఉన్న ముగ్గురు పేద కళాకారులకు సహాయ నిధిగా అందించాడు. ఆ ముగ్గురిలో తనూ ఉంది.

అది జరిగిన ఆరు నెలలకి అతనికి ట్రాన్స్‌ఫరయింది. మళ్ళీ అతణ్ణి చూడటమే పడలేదు.

మరికొంత కాలం గడిచేసరికి తన జీవితమే ఓ పెద్ద మలుపు తిరిగింది.

ఆనంద్ తనను పెళ్ళి చేసుకొన్నాడు.

ఆనంద్ అంతో, ఇంతో ఆర్థికంగా బలపడిన మనిషి. జీవితంలో అనుకోని ఆ మలుపుతో తన చుట్టూ ఉన్న సమస్యల సాలెగూళ్ళు క్రమంగా ఒక్కొటీ విడిపోయాయి.

తల్లికూడా తనువు చాలించింది.

పూర్వంలా బాధలూ, బరువులూ లేవు.

కష్టాలూ, కన్నీళ్ళూ కాలంతోపాటే కరిగిపోయాయి. కోరుకున్న తిండీ, బట్టా లభించాయి. జీవితం ప్రశాంత వాతావరణంలో మొగ్గ తొడిగింది.

దానితో తన నట జీవితానికి శాశ్వతంగా ఓ తెర పడిపోయింది.

"ఏయ్, లతా...వస్తానూ..." అన్య మనస్కంగా ఉన్న లత భుజం కుదిపి మధ్యలో దిగిపోయింది లీల.

లత మనస్సులో ఒక్కసారిగా గత చరిత్ర రెక్క విప్పేటప్పటికి శరీరం కాస్త వేడెక్కిన ట్లయింది.

బస్సు డిపోలో కొచ్చి ఆగింది.

** ** **

లత షాపింగ్ ముగించుకుని ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసులో అడుగు పెట్టేసరికి ఆ రోజు మధ్యాహ్నం రెండుంబా వయింది. రెవెన్యూ క్లర్క్ లెక్కలు చూసి ఎడ్జస్ట్‌మెంట్ బిల్ బాకీతో సహా మొత్తం ఆరు వందల యాభయ్యా రూపాయిలు కట్టాలంటూ స్లిప్ చేతి కందించాడు.

లతకు ఆ స్లిప్ చూడగానే షాక్ కొట్టినట్లయింది. అనుకొన్న దానికంటె అదనంగా ఏవేవో అంకెలు కనిపించాయి. తెచ్చిన డబ్బులో కొంత షాపింగ్ మింగేసింది. ఎలా?

ప్రస్తుతం తన దగ్గరున్న సొమ్ము కేవలం అయిదు వందల పది రూపాయలు మాత్రమే.

మరో నూట నలభయ్యారూపాయలైనా ఉంటేనే కాని పని కాదు. తిరిగి వెళ్ళడానిక్కూడా కనీసం ఓ పదిహేను రూపాయలైనా ఉండాలి.

ఎల్లుండే ఫంక్షన్. ఆహ్వానించిన వాళ్ళంతా విధిగా వస్తారు. ఇంట్లో కరెంట్ లేకపోతే ఏం బాగుంటుంది?...ఎంత అవమానం! ఈ రోజు గడిస్తే మళ్ళీ మూ డ్రోజులవరకు ఆఫీసుకు సెలవులాయె. కరెంటు బిల్లు కట్టడం మర్చిపోయి ఊరికెళ్ళడంతో ఇంత అనర్థం ఎదురయింది.

ఆయన తన కీ పని పురమాయించి అర్జెంటుగా హైదరాబాద్ వెళ్ళిపోవడంతో ఆ బాధ్యతంతా తన మీద పడింది. ఉంటుందనుకొన్న స్నేహితురాలు కూడా ఊళ్ళో లేకుండా పోయింది. ఆమెను స్వయంగా పిలవాలన్న మిషతో కొంత పని కల్పించుకొని ఈ ఊరు వచ్చింది తను.

అన్నీ ఎదురు తిరిగిన ఈటె లయ్యాయి.

లత మనస్సు పరిపరి విధాలుగా చీలిపోతోంది. పని కాకుండా చీకటి ముఖంతో ఇంటి కెళ్ళాలంటే అడుగు ముందుకు పడటం లేదు.

"అంత డబ్బు తేలేదండీ. పదిహేను రోజుల తర్వాత ఈ ఉదయమే ఊరినుండి వచ్చాం...సప్లయి ఏరియల్‌పై డిస్కనెక్ట్ చేశారని తెలిసింది. ఎల్లుండే ఫంక్షన్. అయిదు వందలు వరకు కడతాను. మిగతాది మీ రెప్పుడు కట్టమంటే అప్పుడు కడతాను." అభ్యర్థిస్తూ అడిగింది లత.

ఆ ఉద్యోగి అంతా విని తన నిస్సహాయతను వ్యక్తం చేశాడు. అంతేకాదు. మరో అరగంటలో డబ్బు చెల్లించకపోతే కౌంటర్ క్లోజ్ చేస్తారని కూడా చెప్పాడు.

అశనిపాతంలాంటి ఈ మాటతో లత మరింత కంగారుపడింది. ఎలా?

పది నిమిషాల్లో ఇంటి కెళ్ళి డబ్బు తీసుకొని రావడానికి తన దీ ఊరు కాదు. జంగారెడ్డిగూడెం వెళ్ళాలి. వెళ్ళి రావడానికే కనీసం నాలు గ్గంటలు పడుతుంది. తన కీ సిడదవోలులో అంతగా తెలిసినవాళ్ళు లేరు. రీ-కనెక్షన్ ఆర్డర్సుకోసం ఇంతదూరం శ్రమపడి వచ్చినా ఫలితం కనిపించడం లేదు.

లతకు రాను రాను ఆందోళన ఎక్కువయింది. మళ్ళీ రిక్వెస్టు చేసిం దామె. బిల్లింగ్ సూపరింటెండెంట్‌ని చూడమన్నాడు రెవెన్యూ క్లర్క్. లతకు అక్కడకూడా లాభం లేకపోయింది. ఎకౌంటెంట్‌ని కలిసింది. ఆయనకూడా అంతే చెప్పాడు.

మళ్ళీ రెవెన్యూ క్లర్క్ దగ్గర కొచ్చింది మార్గం చెప్పమని. బకాయిలను పూర్తిగా చెల్లించి, రీ-కనెక్షన్ ఆర్డర్సు పొందడం మినహా మరో మార్గం లేదని

ఆ ఉద్యోగి చెప్పాడు.

ఆమెకు ఏం చేయాలో బోధపడలేదు.

ఆఫీసర్ గదిలోంచి ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు.

ఎంతో బాగా చేసుకొందామనుకొన్న ఫంక్షన్‌కి చివరికి ఇలా చీకటి తెర పడుతున్నందుకు లతలో క్రమంగా ఉత్సాహం సన్నగిల్లిపోయింది.

మరో అయిదు నిమిషాలు-

ఈ అవకాశం కాస్తా గడిస్తే మళ్ళీ మూడ్రోజుల వరకు సెలవులు. చీకట్లో జీవితం...ఇక చివరిసారిగా ఆఫీసర్‌గారిని చూసి, తిరిగి వెళ్ళిపోదామనుకొంది లత.

"అయ్యగారు పిలుస్తున్నారు, సార్." రవెన్యూ క్లర్క్‌కి ఆఫీసర్‌నుంచి పిలు పొచ్చింది.

క్లర్క్ పిలుపు రావడమే తడవుగా లోపలికెళ్ళాడు. ఆఫీసర్‌కీ, ఆయనకీ మధ్య రెండు నిమిషాల సంభాషణ జరిగింది. క్లర్క్ బయటికొచ్చి ఆమె దగ్గిరున్న సొమ్ము తీసుకొని "కూర్చోండి" అని స్టూల్ చూపించాడు.

ఆ మాటకు మండు వేసవిలో పన్నీటి జల్లు కురిసినంత ఆనందపడిం దామె.

చివరికి ఇంత సుగమంగా వచ్చిన పని అవుతున్నందుకు తృప్తిగా గాలి పీల్చుకుంది.

అర గంట గడిచింది.

రీ-కనెక్షన్ ఆర్డర్స్ చేతికొచ్చాయి. రశీదు చూసుకొంది. డబ్బేమీ తగ్గినట్లుగా లేదు. అక్షరాలా ఆరు వందల యాభయ్యారూపాయలు చెల్లించినట్లు ఆ రశీదులో దాని తాలూకు వివరా లున్నాయి.

"రశీదు ఎక్కువ డబ్బు కిచ్చా రేమిటి? ఇచ్చింది అయిదు వందలే కద?" సందేహంగా అడిగింది లత.

"ఈ సహాయానికి కారణం మేం కాదండీ!..."

"అంటే...దయచేసి కాస్త వివరంగా చెప్పండి."

"మిగతా సొమ్ము మా ఆఫీసరుగారు చెల్లించారు. ఇంతకంటే వివరాలు మాకేమీ తెలీవు."

"మీ ఆఫీసరుగారా...పేరు!" లత కళ్ళలో ఆశ్చర్యం.

లత ఆఫీసర్ గదిలోకి అడుగు పెట్టింది.

అడుగుపెడుతూనే ఒక్కసారిగా అవాక్కయింది.

ఎవరో వెన్ను తట్టి పరిహసించిన ట్లయింది ఆ నిమిషంలో. అక్షరాలా అతనే-సూర్యప్రకాష్! ఆమె కళ్ళు సూర్య బింబంలా వెలిగిపోతోన్న అతని మంచితనం వేపు చూడలేక పోతున్నాయి.

"కూర్చోండి! మీ పని పూర్తయిందా!" అతని మాటల్లో ఆత్మీయత, అంతకు మించి మానవత్వం తొణికిసలాడాయి.

ఆమె మనస్సు ఒక ప్రక్క సిగ్గుతో, మరో ప్రక్క పశ్చాత్తాపంతో కుంచించుకుపోతోంది.

ఆమెలో ఆత్మ పరిశీలన...

ప్రకాష్ ఎంత మంచివాడు!

తన కేమాత్రం తెలీనట్లుగా బస్సులో అతణ్ణి పరాభవం చేసినా, అతనుమాత్రం ఏమీ బాధపడలేదు. అతనిలో ఆ స్పృహే లేదు!

ప్రతీకారంగా, పగ తీర్చుకోవాలన్న అభిప్రాయం అణుమాత్రం కూడా లేదు.

దెబ్బతిని కూడా రక్తదానం చేసిన మహామనీషి ప్రకాష్. విరబోసుకొన్న తన చీకటి మనస్సుకి వెలుగు రేఖల్ని పంచిన మహాత్ముడు ప్రకాష్.

నాటికీ, నేటికీ అతని సౌజన్యం అలానే ఉంది.



మనిషిని మనిషిగా చూచే తత్త్వం, మానవతాదృష్టి అతన్నుండి ఏమాత్రం విడిపోలేదు.

ఎకౌంటెంట్ నుండి ఆఫీసరు స్థాయి వరకు ఎదిగాడు. అదే ప్రేమ-అదే సౌజన్యం ఇప్పటికీ పరిమళిస్తున్నాయి.

మరిందల్లా తను-తొలి మెట్టునుండి కొండ కొనవరకు ఎగబ్రాకింది తను. అక్కడనుండి చూస్తుంటే తన భౌతిక దృష్టికి అన్నీ అల్పంగానే కనిపించాయి.

అహంగానీ, గర్వంగానీ తననే పెనవేసుకొన్నాయి తప్ప, అతనిలో ఆ నిమ్నోన్నతాల జాడలు ఏమాత్రం కనిపించడం లేదు.

అదే అహం తనను కృతఘ్నురాలిగా ముద్రవేసి వదిలిపెట్టింది.

ఒకనాడు తనను నిష్కామంగా ఆదరించి, తన కళా సరస్వతికి నీరాజనం పట్టిన ప్రకాష్‌ని ఈ రోజు బస్సులో అతని అనాకారితనాన్ని వెగటుగా చూసి అసహ్యించుకొంది. అవమానించింది. షో కేసులో బొమ్మలా ఉన్న లీల సమక్షంలో అన లాంటి వ్యక్తితో మాట్లాడటమే ఒక చిన్నతనంగా భావించింది. అత నెవరో తెలీనట్లు అద్భుతంగా నటించింది.

మానవతా దృక్పథంలో ఇప్పటికీ ప్రకాష్ ఒకో అడుగూ ముందుకు వేస్తూ పురోగమిస్తున్నాడు.

అదే మార్గంలో తను మాత్రం ఒకో అడుగూ వెనక్కి వేస్తూ తిరోగమిస్తోంది.

ఇద్దరు వేసేవీ అడుగులే.

అయితే, ఆ అడుగుల్లో తనకీ, ప్రకాష్‌కీ ఎంతో తేడా ఉన్నది.

** ** **

లత కళ్ళు తడిసిపోయాయి.

పశ్చాత్తాపం ఆమె ప్రత్యణువునుండీ ఉబికి బయట పడుతున్నది.

ఎదురుగా సూర్యప్రకాష్!

వెలిగిపోతున్నసూర్యుడిలా ఉన్నాడు.

ఆ నిమిషంలో సజల నయనాలతో ఆమె తన రెండు చేతులూ జోడించి "సూర్య" నమస్కారం చేసింది మరెలా కృతజ్ఞతలు చెప్పాలో తెలీక. ●